

సదస్సులో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



వీరసౌధలోని గాంధీ విగ్రహం వద్ద సీఎం, డీసీఎం తదితరులు

## అబద్ధాల ప్రచారంపై పోరాటానికే

# నవసత్యాగ్రహం

● కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ● గాంధీ పరంపరను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ ● హాజరైన ఖర్గే, రాహుల్ గాంధీ

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, ద్వేషం ప్రచారం చేసేవారికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు 'నవ సత్యాగ్రహం' అవసరమని, మహాత్మాగాంధీ పరంపరను రక్షించేందుకు కట్టుబడదామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బెళగావిలో బాధ్యతలు చేపట్టి వందేళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా నవసత్యాగ్రహ వేదికగా ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కీలక సమావేశం గురువారం జరిపింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జయరాం రమేశ్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా సహా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్రనేతలు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో ద్వేషం, అబద్ధాలను ప్రచారం చేసేవారికి వ్యతిరేకంగా పోరాడదామని మహాత్మాగాంధీ ఆశయాలు, పరంపరను సంరక్షించడంతోపాటు భావితరాలకు అందేలా కార్యక్రమాలు చేద్దామని తీర్మానించారు.



సదస్సులో కాంగ్రెస్ నేతలు

### చారిత్రాత్మక సమావేశానికి రాలేకపోయా: సోనియాగాంధీ



దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని అటువంటి కీలక సందర్భంలో పార్టీకి వందేళ్లక్రితం నాటి మహాత్మాగాంధీ అధ్యక్షుడైన సందర్భంగా చారిత్రాత్మకమైన 'నవ సత్యాగ్రహ' సభలో హాజరు కాలేనందుకు విచారంగా ఉందని సందేశంలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికై ఇక్కడ నుంచే కీలకమైన నిర్ణయాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగతంగా సమష్టిగా ముందుకెళ్లి పార్టీ మనుగడతో పాటు దేశ రక్షణకు కట్టుబడదామని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడు కావడం పార్టీకి, ఉద్యమానికి మలుపు అన్నారు. ఇది దేశ చరిత్రలో ఒక పరివర్తనకు మైలురాయిగా అభివర్ణించారు. కాగా మహాత్మాగాంధీ స్ఫూర్తికి వ్యతిరేకంగా నేడు దేశంలో పాలన సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌ల తీరుపై మండిపడ్డారు. మహాత్మాగాంధీ వారసత్వాన్ని పరిరక్షించడానికి మనం పునరంకితం అవుదామని, గాంధీ స్ఫూర్తికి మూలాధారంగా కొనసాగుదామన్నాని సందేశంలో పేర్కొన్నారు. ఈ తరానికి గాంధీజీ ఆశయాలు మార్గనిర్దేశం చేయాలని ప్రస్తావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు వారిని పోషిస్తున్న సిద్ధాంతాల సంస్థలనుంచి బాపూజీ వారసత్వానికి ఉందని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయలేదని, గాంధీజీని వ్యతిరేకించారని హత్యకు దారితీసేలా విషపూరిత వాతావరణం సృష్టించారని పేర్కొన్నారు. గాంధీజీ హంతకులను కొనియాడతారని సందేశంలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా పలు చోట్ల గాంధేయ సంస్థలపై దాడులు జరుగుతున్నాయని, అందుకే ఈ సమావేశానికి నవసత్యాగ్రహగా పిలవడం సముచితమని అభిప్రాయపడ్డారు. ఈ శక్తులను అన్ని విధాలుగా ఎదుర్కొని మన సంకల్పాన్ని పునరుద్ధరణకు రాజీలేని పోరాటం అవసరమని పిలుపునిచ్చారు.

### అంబేడ్కర్‌కు అవమానంపై నేతల ఆగ్రహం

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంటు వేదికగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ప్రధానమంత్రి వెనకేసుకురావడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. ద్వేష రాజకీయాలను సత్యం, అహింసతో పోల్చారు. రెండు రోజుల కాంగ్రెస్ సమావేశాలతో బెళగావి వెలిగిపోతోంది. గురువారం ఉదయం తిలకవాడిలోని వీరసౌధలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వందేళ్లక్రిందట కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన గంగాధరరావు దేశ్‌పాండే ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆవిష్కరించారు. మధ్యాహ్నం రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేతోపాటు అగ్రనేతలు బెళగావికి చేరుకున్నారు. గాంధీజీ చిత్రపటాలతో తిలకవాడిలో ర్యాలీ జరిపారు. సాయంత్రం కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ జరిగింది. సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నా పలు కారణాలతో సోనియాగాంధీ హాజరుకాలేకపోయారు.



చరఖా తిప్పి నూలు తీస్తున్న సీఎం

### నవ సత్యాగ్రహంతో దేశమంతటా కొత్త శక్తి : ఖర్గే

కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతమైన శక్తి ఉందని, గాంధీ, నెహ్రూల వారసత్వం ఉందని దేశంలో ఇటీవలి పరిణామాలు ప్రజలందరూ గమనిస్తున్నారని నవసత్యాగ్రహం పేరిట కొత్త శక్తితో దేశమంతా పార్టీ బలోపేతం చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. నవ సత్యాగ్రహం వేదికనుంచి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటులోనే అవమానం చేశారన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు తప్పుగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంగీకరించకలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. దేశంలో స్వయంప్రతిపత్తి సంస్థలను నియంత్రిస్తున్నారన్నారు. సీబీఐ, ఐటీ, ఈడీలతో పాటు ఎన్నికల కమిషన్‌ను ఉదాహరణగా అభివర్ణించారు.

#### కార్యకర్తలకు నైపుణ్య శిక్షణ

2025లో సంస్థాగతంగా పార్టీ సాధికారత సాధించే సంవత్సరంగా నిలుస్తుందని కొనియాడారు. ఏఐసీసీ నుంచి మండల, బూత్ లెవెల్‌లో జరిగి ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవసరమైన నైపుణ్యాన్ని కార్యకర్తలకు అందిస్తామన్నారు. సిద్ధాంతపరమైన నిబద్ధత కల్గిన కార్యకర్తలను గుర్తించి వారి ద్వారా ముందుకు నడిపిస్తామన్నారు. పార్టీ ఆలోచనలు నమ్మేవారు భారతదేశమంతటా కలసి పని చేయాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటివారి గుట్టురట్టు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

#### అలరించిన హిందుస్తానీ సంగీతం

కాంగ్రెస్ సభలో హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం అలరించింది. ధారవాడ నేషనల్ స్కూల్ విద్యార్థిని వందేమాతరం ఆలపించడంతో సభ ప్రారంభం కాగా మరో పదకొండేళ్ల బాలిక 'ఉదయవాగలి నమ్మ కన్నడ చలువ కన్నడ నాడు' పాట ఆకట్టుకుంది. ఏఐసీసీ మీడియా ప్రచారం విభాగం చీఫ్ పవన్‌కేరా మాట్లాడుతూ.. నవసత్యాగ్రహంలో తీసుకునే నిర్ణయాలు దేశంలో పెను మార్పుకు కారణాలు అవుతాయన్నారు.

#### సభికులకు భారీ బహుమతులు

బెళగావిలో జరుగుతున్న కాంగ్రెస్ శతాబ్ధి ఉత్సవాలలో పాల్గొన్నవారికి రాష్ట్ర పార్టీ భారీ బహుమతులు ఇచ్చింది. రూ.11వేల విలువైన పట్టు శాలువాలతో సత్కరించింది. రూ.30వేల విలువైన లెదర్‌బ్యాగ్‌లను గిఫ్ట్‌గా అందించారు. బెళగావి అంటే ఉత్తర కర్ణాటక, ముంబై కర్ణాటకకు కీలకమైన నగరం. ఇక్కడ ప్రత్యేకమైన రుచులను సిద్ధం చేశారు. అదే తరహాలోనే 11వేల రూపాయల విలువైన మైసూరు శాండల్ బహుమతులను సభ్యులకు అందజేసినట్లు సమాచారం.



వీరసౌధలో గాంధీ విగ్రహానికి నివాళి

### 'నవసత్యాగ్రహం' సభలకు బ్రేక్

● మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ఢిల్లీకి రాహుల్, ఖర్గే.. నేడు ఢిల్లీకి సీఎం



మన్మోహన్ సింగ్‌తో సీఎం (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవహారాలలో కీలకంగా వ్యవహరించి అత్యున్నతమైన ప్రధాన మంత్రి పదవితో విశ్వవ్యాప్తంగా పేరొందిన మన్మోహన్‌సింగ్ మృతి పట్ల రాష్ట్రం యావత్తు విషాదం వ్యక్తం చేస్తోంది. బెళగావిలో మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన శతాబ్ధి సంబరాలు ఒక్కసారిగా విషాదవదనంగా మారాయి. మాజీ ప్రధాని మృతి విషయం తెలియగానే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హుటాహుటిన బెళగావి నుంచి ప్రత్యేక విమానాలలో ఢిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ పార్టీ కీలకనేతలు రాత్రి ఢిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశమంతటా సంతాపదినాలు కొనసాగుతున్నాయి. దీంతో బెళగావిలో జరుగుతున్న నవసత్యాగ్రహం సంబరాలకు బ్రేక్ పడింది. బెళగావి సమావేశానికి దేశవ్యాప్తంగా సుమారు 160మందికిపైగా ఎంపీలు, 450మందికిపైగా ప్రతినిధులు పాల్గొనగా వీరు శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాలకు బయల్దేరాల్సి ఉంది. అయితే మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో అత్యవసరంగా ఢిల్లీకి బయల్దేరాల్సి రావడంతో ఇండిగో సంస్థ సర్వీసు అందించేందుకు ముందుకొచ్చింది.

మన్మోహన్‌సింగ్ మృతి విషయం తెలియగానే సీఎం సిద్దరామయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక పటిష్టతకు మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివన్నారు. తాను ముఖ్యమంత్రిగా 2013-18 మధ్యన ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ ప్రధానిగా కొనసాగారని గుర్తు చేసుకున్నారు. శుక్రవారం ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిపారు.

#### నేడు విద్యాసంస్థలకు సెలవు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల వారం రోజులు సెలవు దినాలు ప్రకటించగా, శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.



సైనికులకు నివాళి అర్పిస్తున్న సీఎం సిద్ధరామయ్య

### సైనికులకు సీఎం నివాళి

జమ్ము-కశ్మీర్‌లో మిలిటరీ వాహన ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు సైనికులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య నివాళి అర్పించారు. బెళగావిలో సుబేదార్ దయానంద్ తిరుకణ్ణవర్, మహేష్ మారిగొండ పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి, నివాళులర్పించారు. 7లో..

### రాజీనామా చేస్తే ప్రాణాలతో ఉంటావ్..!

● లేదంటే పోక్సో కేసులో జైలుకు పంపుతాం
● ఎమ్మెల్యే మునిరత్నకు బెదిరింపులు
● పోలీసులకు ఫిర్యాదు

బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై కొందరు ఆకతాయిలు కోడిగుడ్ల దాడి చేసిన వివాదంలో ఆయన పోలీసులకు ఫిర్యాదులో చేశారు. పలు సంచలన విషయాలు ఆయన బయట పెట్టారు. ఏకంగా ఏడు పేజీల ఫిర్యాదులో పలువురి వేధింపులు వివరించారు. 7లో..

### న్యాయమూర్తి పేరిట లంచం డిమాండ్

● మహిళా న్యాయవాదిపై ఎఫ్ఐఆర్

వివరాలు 7లో..



వైసీపీ ప్రభుత్వ హయాంలో నం-2 ఎస్సీ హాస్టల్‌లో గోడచాటు నీడన లైన్లో నిలబడి భోజనం చేసేందుకు వెళ్తున్న విద్యార్థినులు





పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో కళకళలాడుతున్న గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు





# కొత్త వెలుగులు





## నాడు-నేడుతో మాయ

వైసీపీ ఐదేళ్ల పాలనలో శిథిలమైన సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టడంలో నాడు-నేడు పేరుతో మాయ చేసింది. జిల్లాలో 2019 నుంచి మరమ్మతులకు సంబంధించి నాడు-నేడు కింద ఉమ్మడి జిల్లాలో 150కిపైగానే వసతిగృహాలను ఎంపిక చేశారు. నిధుల సమస్యతో ఫేజ్-2 కింద ఎంపిక చేసిన వాటిని ఫేజ్-3కి బదలాయించారు. అక్కడ కూడా అవే కష్టాలు ఉత్పన్నం కావడంతో మరమ్మతులను అటకెక్కించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల దుర్భర పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేస్తామని ప్రకటించింది. ఈక్రమంలోనే జిల్లాలో బీసీ సంక్షేమశాఖకు సంబంధించి 32, ఎస్సీ సంక్షేమశాఖ 36, ఎస్టీ సంక్షేమశాఖలో రెండు హాస్టళ్లు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలను మరమ్మతుల కోసం ఎంపిక చేసి నివేదికలు పంపారు. అవన్నీ చెత్తబుట్టకే పరిమితమయ్యాయి. ఇలా నిధులు లేకుండా కేవలం నివేదికలతో గత వైసీపీ ప్రభుత్వం సరిపెట్టి, సంక్షేమాన్ని నీరుగార్చింది.

## మంత్రి సవిత చొరవ



బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సంక్షేమ హాస్టళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఉమ్మడి జిల్లా సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లతో సమావేశాలు నిర్వహిస్తూ... సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మంత్రి స్వయంగా పలు హాస్టళ్లను పరిశీలించి... ఆయా సంక్షేమశాఖల అధికారులతో నివేదికలు తెప్పించుకొని వసతిగృహాల మరమ్మతుల కోసం నిధులు రాబడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు రూ. 20 కోట్ల దాకా నిధులను రాబట్టారు. వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు ఒక్కరంటే ఒక్కరు కూడా సంక్షేమ వసతగృహాల అభివృద్ధిని పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తం అవుతనాన్నాయి. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల చొరవతో సంక్షేమ వసతిగృహాలకు మహర్దశ పడుతోందని పలువురు సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కంటే మెరుగైన సంక్షేమాన్ని అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తోంది. ఈక్రమంలోనే తొలుత పింఛన్ల మొత్తాన్ని పెంచి బకాయిలతో చెల్లించి భేష్ అనిపించుకుంది. అలాగే వైసీపీ పాలనలో నిధులు లేక నీరసించిపోయిన సంక్షేమ వసతిగృహాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. వాటి స్థితి గతులు తెలుసుకుని, క్రమంగా మెరుగు చేయడానికి నిధులను సైతం విడుదల చేసింది. ప్రజాప్రతిధులు సైతం ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇక ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత దక్కించుకున్న సీఎం చంద్రబాబు ప్రస్తుతం వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ మహిళల జీవనోపాధుల పెంపుకోసం తపిస్తున్నారు. వైసీపీ పాలనలో మూసివేసిన అన్న క్యాంటిన్లను పునఃప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చుతోంది. ఏరకంగా చూసినా గత వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి సర్కారు ప్రజా సంక్షేమం కోసం మెరుగ్గా కృషి చేస్తోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే గత వైసీపీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన మధ్య తేడాలను ఎత్తి చూపుతున్నారు.

## సంక్షోభాన్ని దాటి.. సంక్షేమం వైపు



స్వయం సహాయక సంఘాల మహిళలు

- నెలల వ్యవధిలోనే వైసీపీ కంటే మెరుగైన సంక్షేమం
- అన్ని వర్గాలకు పెరిగిన పింఛన్ మొత్తాలు
- సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు విడుదల
- డ్వాక్రా మహిళల స్వయం సమృద్ధికి చర్యలు
- పేదల ఆకలితీర్చే అన్న క్యాంటిన్ల పునఃప్రారంభం
- కూటమి ప్రభుత్వంపై పేద వర్గాల్లో కృతజ్ఞత

నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో వైసీపీ పాలనలో సంక్షేమ వసతి గృహాల్లో అంధకారం అలముకుంది. వసతి గృహ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా, పైకప్పు పెచ్చులూడిపడుతున్నా, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వసతిగృహాలను పట్టించుకోమని కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి వేదన అరణ్య రోదన అయ్యింది. ఫలితంగా పేదింటి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతిగృహాల అభివృద్ధికి రూ. కోట్లల్లో నిధులు విడుదల చేసింది. దీనిపై పలువురు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్/క్లాక్‌టవర్/అర్బన్

## ఆరునెలల్లోనే అభివృద్ధి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే ఆయా వసతిగృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంది. మొదటి నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన, సమస్యల నడుమ ఉన్న వసతిగృహాలకు సంబంధించిన నివేదికలను తెప్పించుకుంది. అనంత జిల్లాలో మొదటి విడతగా 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను ఎంపిక చేసింది. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ.1.85 కోట్లు విడుదల చేసింది. మూడు నెలల్లోనే ఆయా వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టింది. అలాగే జిల్లాలో శిథిలావస్థకు చేరి, సమస్యలతో సతమతమవుతున్న హాస్టళ్లను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను ఎంపిక చేశారు. ఇందులో 28 హాస్టళ్లకు మరమ్మతులు, మౌలిక వసతులు, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ. 3.67 కోట్ల అంచనా వ్యయంతో నివేదికలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 23 ఎస్సీ హాస్టళ్లలో సీలింగ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్, పెయింటింగ్ సమస్యలు గుర్తించారు. వీటి కోసం దాదాపు రూ. 5.85 కోట్లు నిధులను కేటాయించగా పనులు ముమ్మరం చేశారు. తాజాగా మరోమారు ఆ జిల్లాలో మరో 10 వసతిగృహాలకుపైగా అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించగా వాటి కోసం రూ. 11.56 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

## డ్వాక్రా మహిళల కోసం..

స్వయం సహాయక సంఘాల మహిళలు (డ్వాక్రా) జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు అందిస్తోంది. జిల్లాలో ఎస్సీ కేటగిరీలో 5,799 సంఘాల్లో 75,037మంది ఉండగా, ఎస్టీలో 1050సంఘాల్లో 15,846మంది, బీసీ కేటగిరిలో 24,237సంఘాలకు గాను 2,14,279మంది, ఓసీ కేటగిరిలో 4016సంఘాల్లో 61,644మంది, మైనార్టీ కేటగిరిలో 795సంఘాల్లో 12,627మంది మహిళలు ఉన్నారు. వీళ్లందరి అభివృద్ధి కోసం గతంలో కంటే కూటమి ప్రభుత్వంలో మెరుగైన పథకాలు తీసుకొచ్చారు. మహిళలకు పేదరికం నుంచి విముక్తి కల్పించి జీవనోపాధుల పెంపునకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



← పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

## సొంతింటి కల నెరవేర్చేలా...

ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. జగనన్న కాలనీల పేరిట స్థలాలు కేటాయింపు, లబ్ధిదారుల ఎంపిక, బిల్లులు చెల్లింపు వరకు అక్రమాలు జరగడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని అలాగే వదిలేస్తే కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు, నిధుల మంజూరుపై ప్రభావం పడే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందుకే వైసీపీ పాలనలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు మన- ఇల్లు - మన గౌరవం పేరిట కార్యక్రమం చేపట్టింది. పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాల్లో శ్రీసత్యసాయి జిల్లాలో 5553 గృహ నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చికి పూర్తిచేయాలని లక్ష్యం పెట్టి నిర్మాణాలు చేయిస్తోంది.



పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఆగిన నిర్మాణం

## పింఛన్‌దారుల్లో ఆనందం

ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వంలో అత్యధికంగా లబ్ధిపొందినవారు పింఛన్‌దారులే. గత వైసీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ మొత్తంలో పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అందిస్తూ ఆపన్నులకు ఆసరాగా నిలుస్తోంది. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచే పెంచుతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆమేరకు జూలై నెలలో పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలల బకాయిలను సైతం చెల్లించారు. జూలైకి సంబంధించి మొత్తం పింఛన్‌దారులు 2,89,995మందికి గాను పెంచిన సొమ్ముతో కలిపి రూ.127కోట్లు, బకాయిలు రూ.70.73కోట్లు మొత్తం రూ.197కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నెల నుంచే రూ.4000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యాంగులకు వైసీపీ ప్రభుత్వంలో చెల్లిస్తున్న రూ.3000లను కూటమి ప్రభుత్వం రూ.6000కు పెంచింది. పెరాలసిస్ బాధితులకు రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.15వేలకు పెంచింది. కిడ్నీ బాధితులు, థలసేమియా వంటి రోగులకు పింఛన్ మొత్తాన్ని రూ.5000నుంచి కూటమి ప్రభుత్వం రూ.10వేలుకు పెంచింది. పింఛన్ పెంపు పట్ల ఆయా వర్గాల్లో సంతోషం, ప్రభుత్వం పట్ల కృతజ్ఞత వ్యక్తం అవుతోంది.

## వంటింటికి వెలుగులు..



దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో పల్లె సింధూరరెడ్డి (ఫైల్)

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని నెలలకే రేషన్ కార్డు లబ్ధిదారులకు దీపావళి కానుక ఇచ్చింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా నవంబరు ఒకటి నుంచి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 536289 కనెక్షన్లకి ఉచితంగా సిలిండర్లు అందుతున్నాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు సిలిండర్ ధర బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



అనంతపురంలోని బళ్లారి బైపాస్‌లో అన్న క్యాంటిన్‌కు కొత్త కళ

## పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటిన్

గత టీడీపీ పాలనలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్లు పేదల ఆకలి తీర్చేవి. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటిన్లను మూసివేసింది. దీంతో జిల్లా కేంద్రం, పట్టణ ప్రాంతాలకు పలు పనులపై వచ్చిన ప్రజలు, పట్టణంలో కూలి పనులు చేసుకొని బతికే నిరుపేదలు, భిక్షాటన చేసే వారు అన్నం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతకు ముందు నిత్యం వివిధ వర్గాల ప్రజలతో కళకళలాడిన క్యాంటిన్లు మందుబాబులు, అసాంఘిక వర్గాలకు అడ్డాగా మారాయి. అయితే మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటిన్లు పునఃప్రారంభమయ్యాయి. అనంతపురంలో మూడు అన్న క్యాంటిన్లు నడుస్తున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో ఒక్కోటి ఏర్పాటు చేశారు. ఈ క్యాంటిన్ల ద్వారా రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ పెడుతున్నారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్‌లో భాగంగా రోజు వారి షెడ్యూల్ మేరకు ఇడ్లీ, పూరి, పొంగల్, ఉప్మా పెడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో షెడ్యూల మేరకు వైట్ రైస్ తోపాటు పప్పు, సాంబార్, పచ్చడి, పెరుగు ఇస్తున్నారు. టిఫిన్, భోజనం ఏదైనా రూ.5లకే పేదలకు అందిస్తున్నారు. జిల్లాలోని ఒక్కో అన్న క్యాంటిన్‌లో ప్రతి రోజు 1000 మందికిపైగా టిఫిన్, భోజనం తింటున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు నెలలో అన్న క్యాంటిన్లను ప్రారంభించి కూటమి ప్రభుత్వం పేదల ఆకలి తీరుస్తోంది.





బళ్లారి బైపాస్‌లో వైసీపీ హయాంలో అన్న క్యాంటిన్ దుస్థితి

# జనవరిలో జిల్లాకు కరువు అంచనా కమిటీ

### ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరువు మండలాల్లో పరిస్థితుల అంచనాకు కేంద్ర మినిస్టీరియల్ కమిటీ జిల్లాకు రానుందని ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ శర్మ పేర్కొన్నారు. దీనిపై కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారుల తో ఇన్‌చార్జ్ కలెక్టరు గురువారం సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు కరువు మండలాలలో పర్యటించి, పరిస్థితులను అంచనా వేస్తారని తెలిపారు. జనవరి 2,3తేదీల్లో ఈ కేంద్ర కమిటీ వస్తుందన్నారు. ఈకమిటీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. 2024ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన ఏడు ప్రాంతాలను కరువు మండలాలుగా ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. కేంద్రకమిటీ కూడా అనంతపురంరూరల్, నార్పల, బుక్కరాయసముద్రం, రాప్తాడు, గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు మండలాల్లో పర్యటిస్తుందన్నారు. అక్కడ ఈకమిటీ కరువు పరిస్థితులను పరిశీలించి అంచనావేస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు పక్కా సమాచారాన్ని కమిటీకి చూపించాలని ఇన్‌చార్జ్ కలెక్టరు ఆదేశించారు. కమిటీకి వసతి, పర్యటనకు వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరువుకు సంబంధించిన పరిస్థితుల ఫొటోలను చూపించడానికి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్షపాతం, పంటలు తదితర అన్నిరకాల వివరాలు దగ్గర ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిటీ పర్యటన రూట్‌మ్యాప్, పోలీస్ బందోబస్తు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జలజీవన్‌మిషన్ పనులు, ఉపాధి పనులు, భూగర్భజలాల పరిస్థితులు కమిటీ దృష్టికి తీసికెళ్లాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, డీపీఎం ఆనంద్, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, గ్రౌండ్‌వాటర్ ఏడీ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ

# ఆంధ్రా అండర్-23 జట్టుకు జిల్లా క్రికెటర్ ఎంపిక



మహేంద్రరెడ్డి



కోచ్ బొమ్మన్న

అనంతపురం క్లాక్‌టవర్/తాడిపత్రి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-23 జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు మహేంద్రరెడ్డి ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో బీసీసీఐ అండర్-23 వన్డే టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున మహేంద్రరెడ్డి పాల్గొన్నాడు. ఇతడు తాడిపత్రి ఆర్డీటీ క్యాంపునకు చెందిన క్రీడాకారుడని ఏటీఎల్ లలిత గురువారం తెలిపారు. గతంలో అండర్-14, 16, 19లో పాల్గొని మంచి ప్రతిభ చూపాడని తెలిపారు. రాంచీలో జరిగే అండర్-23 పోటీల్లో ఆంధ్రాజట్టు తరఫున మహేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాకు చెందిన బొమ్మన్న ఆంధ్రా అండర్-23 మహిళా జట్టుకు ఎస్‌సి (స్ట్రెంత్ అండ్ కండీషనింగ్) కోచ్‌గా నియమితులయ్యారు. ఎంపికైన మహేంద్రరెడ్డి, బొమ్మన్నకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

# విదేశీ భాషలతో ఉపాధి

### ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విదేశీ భాషలతో(ఫారిన్ లాంగ్వేజ్‌లతో) నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగం లభిస్తోందని ఎస్కే యూనివర్సిటీ వీసీ అనిత తెలిపారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో 2025 విద్యా సంవత్సరానికి గాను ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్‌లో ఫారిన్‌లాంగ్వేజ్ ఆన్‌లైన్ కోర్సు ప్రారంభోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆర్డీటీ ప్రవేశపెట్టిన ఫారిన్‌లాంగ్వేజ్ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోర్సుల నిర్వహణ, ఎస్కేయూతో పరస్పర ఒప్పందం చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఇందులో స్పానిష్, జర్మన్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వంటి ఫారిన్‌లాంగ్వేజ్ కోర్సులు ఉంటాయన్నారు. వీటికి ఎస్కేయూ ద్వారా శిక్షణ తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఓ వైపు టీచర్లకు, మరోవైపు నిరుద్యోగులకు ఫారిన్ లాంగ్వేజ్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందించడం, ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పీజీ డిప్లొమా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ నాగభూషణం రాజు, ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీటీ ఫారిన్‌లాంగ్వేజ్ డిప్లొమా సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎస్కేయూ వీసీ అనిత

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

### మిర్జా గాలిబ్ (జయంతి)



'ఉర్దూ కవి సామ్రాట్‌'గా పేరొందిన మిర్జా అసదుల్లా ఖాన్ 1797 డిసెంబరు 27న ఆగ్రాలో జన్మించారు. కలం పేరు 'గాలిబ్'. ఉర్దూ, పారశీ భాషలలో కవిగాను, రచయితగాను పేరు గడించారు. రెండో బహదూర్ షా ఆస్థాన కవి, గురువు కూడా. గజల్ రాయడంలో దిట్ట. లేఖలు రాయడంలో ప్రసిద్ధి. ఎంతటి విషాద వృత్తాంతాన్నయినా, ఎట్టి గంభీర విషాదాన్నయినా పరిహాస రూపంలో ప్రకటించే స్వభావం ఆయనది. 1869 ఫిబ్రవరి 15న కన్నుమూశారు.

### లూయీ పాశ్చర్ (జయంతి)



టీకాల ఆవిష్కారానికి ఆద్యుడు, ప్రముఖ ఫ్రెంచి జీవశాస్త్రవేత్త లూయీ పాశ్చర్ 1822 డిసెంబరు 27న జన్మించారు. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములని కనుగొని రోగ నివారణకు బాటలు వేశారు. తొలిసారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశపెట్టిన వ్యక్తిగా సుపరిచితులు. ఈ పద్ధతిని పాశ్చరైజేషన్ అంటారు. సూక్ష్మజీవశాస్త్ర వ్యవస్థాపకులైన ముగ్గురిలో ఒకరు. మిగిలిన ఇద్దరు రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్. రెండుసార్లు గుండె పోటు, తర్వాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరి శోధనలకే అంకితమయ్యారు. అత్యుత్తమ గౌరవమైన లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందారు. 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. ఆయన జ్ఞాపకార్థంగా ఆ రోజును వరల్డ్ రేబీస్ డేగా ఆచరిస్తారు.

### సల్మాన్‌ఖాన్ (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటుడు, నిర్మాత సల్మాన్‌ఖాన్ 1965 డిసెంబరు 27న జన్మించారు. అసలు పేరు అబ్దుల్ రషీద్ సలీం సల్మాన్ ఖాన్. బాలీవుడ్‌లో అనేక విజయవంతమైన, ప్రభావవంతమైన నటునిగా ప్రసిద్ధి చెందారు. సల్మాన్ తండ్రి సలీం ప్రముఖ స్క్రీన్ రచయిత. బివి హోతో అయిసీ (1988) సినిమాలో సహాయ నటుడిగా తెరంగేట్రం చేశారు. తర్వాత సూరజ్ బర్జత్య దర్శకత్వంలో మైనే ప్యార్ కియా (1989) సినిమాతో కథానాయకునిగా మారారు. 90వ దశకంలో ఆయన నటించిన హమ్ ఆప్ కే హై కౌన్, కరణ్ అర్జున్, బీవీ నెం.1 వంటి సినిమాలతో గుర్తింపు పొందారు. 2000వ దశకం కలిసి రాకున్నా 2010లో 'దబాంగ్' సినిమాతో మళ్లీ లాభాల బాట పట్టారు. 9ఏళ్లపాటు వరుసగా బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు చేసిన సినిమాలు అందించిన ఏకైక నటుడు. కాగా కొన్ని కేసుల్లో వివాదాల్లో చిక్కుకుని జైలుపాలై చివరకు నిర్దోషిగా బయటపడ్డారు.

# సైనికులకు ముఖ్యమంత్రి నివాళి



సైనికులు కుటుంబాలకు సీఎం పరామర్శ

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లో మిలిటరీ వాహన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి సైనికుల పార్థివదేహాలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంతాపం తెలిపారు. బెళగావి సైనిక యుద్ధ స్మారకానికి తీసుకువచ్చిన సుబేదార్ దయానంద్ తిరుకణ్ణనవర్, మహేష్ మారిగొండల పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాట్లాడుతూ సైనికుల బతుకు, జీవనం, వృత్తి అత్యంత ఉన్నతమైనదన్నారు. రాష్ట్రానికి చెందిన నలుగురు సైనికులు రెండు ప్రమాదాలలో అమరులు కావడం బాధాకరమన్నారు. నలుగురి సైనికుల ఆత్మకు శాంతి కలిగించాలని కోరుతున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమరులైన కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి అందే ఎటువంటి సాయమైనా సకాలంలో అందిస్తామన్నారు.

## రాజీనామా చేస్తే ప్రాణాలతో ఉంటావ్..

బెంగళూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరీనగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై బుధవారం గుడ్డుతో దాడి చేసిన వివాదంలో ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు సంచలన విషయాలు నమోదు చేసుకున్నారు. ఏకంగా ఏడు పేజీల ఫిర్యాదులో పలువురి వేధింపులు వివరించారు. ఈనెల 5న ఇద్దరు న్యాయవాదుల రూపంలో వచ్చి ఇప్పటికీ మించినది లేదని, వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని హెచ్చరించారన్నారు. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ముందుగా పోక్సో కేసులో జైలుకు పంపుతామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. మా అన్న డీకే సురేష్ సంతోషంగా ఉండాలని, లోక్‌సభ ఎన్నికలలో ఓడించినందుకు బాధపడ్డారని తెలిపినట్లు పేర్కొన్నారు. అన్న సంతోషంగా ఉండాలంటే కుసుమ రాజరాజేశ్వరీనగర్ ఎమ్మెల్యే కావాలని బెదరించినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం లక్ష్మీహెబ్బాళ్కర్ తరహాలోనే కుసుమ మంత్రి కావాలని ఇదంతా జరగాలంటే ముందు రాజీనామా చేయాలని లేదంటే 100-150ల మంది సిద్ధంగా ఉంటా రని నియోజకవర్గంలో ఏ కార్యక్రమంలో పాల్గొన్నా వారు వెంటాడుతారని యాసిడ్ గుడ్లతో దాడి చేస్తారని సిరంజీలతో దాడి చేస్తారని హెచ్చరించారన్నారు. ఆ పరిణామమే దాడి జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులో మాజీ ఎంపీ డీకే సురేష్, స్థానిక పార్టీ ముఖ్యనాయకురాలు కుసుమ, లక్ష్మీహెబ్బాళ్కర్‌తో పాటు 150ల మంది పేర్లు నమోదు చేసినట్లు తెలుస్తోంది. గుడ్లతో దాడి చేసిన వారిని అరెస్టు చేసి వెంటనే విడుదల చేసిన విషయమై కూడా ఎమ్మెల్యే కుట్రలో భాగమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి గురైన ఎమ్మెల్యే మునిరత్నను బెంగళూరు గ్రామీణ ఎంపీ, డాక్టర్ మంజునాథ్ పరామర్శించారు. గుడ్డులో యాసిడ్ కారకాలు ఉన్నా యని అభిప్రాయపడ్డారు. కాగా బుధవారం ఎమ్మె ల్యేపై గుడ్లతో దాడి చేసి అరెస్టు అయిన విశ్వనాథ్, కృష్ణమూర్తి, చంద్రులు పోలీసులకు ఎమ్మెల్యేపై ప్రతిఫిర్యాదు చేశారు. గుంపుగా చేరి తమపై దాడికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిన మేరకు ప్రతిఘటించామని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## దళారులను తప్పించేందుకు భూరక్ష పథకం

▸▸ మంత్రి కృష్ణబైరేగౌడ వెల్లడి



మీడియాతో మంత్రి కృష్ణబైరే గౌడ

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారుల బెడద తప్పించేందుకు భూరక్ష పథకం అమలులోకి తెస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. తాలూకాలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో దళారుల దందాపై విచారం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, రికార్డు రూం సహా అన్ని చోట్లా దళారుల బెడద పెరిగిందని ప్రజలు వాపోతున్నారన్నారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా తీవ్రంగా పరిగణించి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారుల పేరిట కొంతమంది వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. బోగస్ రికార్డులతో రిజిస్టర్ చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. రికార్డు రూంలో డబ్బులు లేకుండా ఎలాంటి పని జరగడం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారన్నారు. ఈ కారణంగానే రికార్డులను స్కాన్ చేసి వాటిని ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నామన్నారు. ల్యాండ్ గ్రాండ్, ఓఎం, సాగువళి చీటి వంటివాటిని ఆన్‌లైన్‌లో ఉంచడం ద్వారా ప్రజలు తెలుసుకోవచ్చునన్నారు. జనవరి మొదటివారం నుంచి భూరక్ష పథకం అమలులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలోని 220 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్కానింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని, తద్వారా వీటిని దిద్దే అవసరం ఉండదన్నారు. ఇంతవరకు రికార్డులను దిద్దారని ఇకపై ఉండదన్నారు. సమర్థత కల్గిన అధికారులతో రికార్డుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



గ్రామవీధులలో కళాకారుల బృందంతో నిర్వాహకులు

బంగారపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఐనూరహసహళ్ళి పరిధిలోని కారమంగల గ్రామంలో కన్నడ సంస్కృతిశాఖ, రత్న ట్రస్టు, గ్రామపంచాయతీ సంయుక్తంగా 2024-25 వార్షిక ప్రత్యేక కార్యక్రమంలో దేశీయ సంస్కృతి సంప్రదాయాలను చాటే చైతన్య ప్రదర్శనలు గ్రామస్థులను అలరించాయి. ఐనూరహొసహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు కేజీ మంజునాథ్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పాటించడం ద్వారా కోపం, అసూయ, ద్వేషం వీడేలాంటి సందేశా లను చాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. రామనగర జిల్లా రిటైర్డు జిల్లా అధికారి చంద్రశేఖరయ్య మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు కేవలం మనోరంజనకే కాదని అవి మన జీవన విధానమన్నారు. సమాజంలో చైతన్యం కోసమే సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. రత్న ట్రస్టు కార్యదర్శి ఎం నాగరాజు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాలలో దేశీయ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు శాఖ సహకారం ఉత్తమంగా ఉందన్నారు. వీరభద్రస్వామి జానపద కళాబృందం ఆధ్వర్యంలో వీరగాసె, కీలుగుర్రాలు, గారడీ బొమ్మలు, డొళ్ళుకుణిత, తదితర వేషధారణతో గ్రామవీధులలో ర్యాలీ సాగింది. కోలారుకు చెందిన రిటైర్డు అధికారి నరసింహయ్య, పంచాయతీ సభ్యుడు ఆర్ వెంకటేశ్‌రెడ్డి, రమేశ్, మంజుళ, సమతా సైనికదళ జిల్లా అధ్యక్షుడు గుట్టహళ్ళి శ్రీనివాస్, అశ్వథ నారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## మల్బరీ పెంపకంపై అవగాహన



పట్టురైతులకు బయో ఎరువు, సిరి బూస్ట్‌ప్యాక్ అందజేత

శిడ్లఘట్ట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల దిగుబడి పెరిగేందుకు, నాణ్యత కోసం మల్బరీ ఆకు ఇవ్వాలని అందుకుగాను మల్బరీ ఆకు తోట నిర్వహణ, పట్టు పురుగుల పెంపకం ఎంతో కీలకమైనదని పట్టుశాఖ ఉపడైరెక్టర్ భోజణ్ణ అభిప్రాయపడ్డారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, పట్టుశాఖ సంయుక్తంగా పట్టణంలోని ప్రభుత్వ పట్టువిత్తన కేంద్రం సభాంగణంలో ఏర్పాటైన తర్ఫీదు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టుగూళ్ల పెంపకంలో పురుషులు, మహిళలు కూడా ఆసక్తిగా పనిచేయడం విశేషమన్నారు. ఇటీవలికాలంలో అన్ని రంగాలలో సాంకేతిక వాడకం పెరిగిందన్నారు. పట్టు రైతులు కూడా దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలన్నారు. రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడరాదన్నారు. ఈ అంశంపై పట్టురైతులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం శాఖల ద్వారా రైతులకు ఇస్తున్న తర్ఫీదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదారు రోజుల గూళ్ల ద్వారా మంచి ధర సాధ్యమన్నారు. అయితే చాలామంది రైతులు నాలుగైదు రోజుల గూళ్లు తెస్తుండడం ద్వారా సరైన ధర పొందలేకపోతున్నారన్నారు. కాగా శీతాకాలంలో పట్టు పురుగుల పెంపకంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిబిరంలో బయో ఎరువు, సిరి బూస్ట్ ప్యాకెట్లను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. బెంగళూరు కృషి మహా విశ్వవిద్యాలయం ప్రాధ్యాపకులు డాక్టర్ మంజునాథ్‌గౌడ, డాక్టర్ ఎన్ అమరనాథ్, కే తిమ్మరాజు, అక్మల్‌పాష, డాక్టర్ జీఆర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డబళ్లాపురకు డిజిటల్ టచ్



వేదికపై ఎమ్మెల్యే తదితరులు

దొడ్డబళ్ళాపుర, డిసెం బరు 26(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర తాలూకాలోని ప్రజలు తమ వార్డులు, గ్రామాల పరిధిలోని సభ్యులు, నగరసభ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో దీన్ని అధిగమించేలా డిజిటల్ టచ్ అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు తన కార్యాలయంలో దొడ్డబళ్లాపుర డాట్‌కామ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ దీని ద్వారా పంచాయతీ, నగరసభ అధికారుల సమా చారం లభించడంతోపాటు వెబ్‌సైట్‌ను గూగుల్‌కు అనుసంధానం చేయడంతో ప్రజలు తమ లోకేషన్ ద్వారా సమస్యను వివరించే అవకాశం ఉందన్నారు. వెబ్‌సైట్‌లోని కంప్లైయింట్ ఫాం ఉందని, దీని ద్వారా ఆయాశాఖల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. వాట్సప్ లైవ్ ద్వారా కాల్‌సెంటర్‌ను సంప్రదించే అవకాశం ఉందన్నారు. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 6 వరకు పనిచేస్తుందన్నారు. వెబ్‌సైట్ ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి వీలవుతుందని, ప్రజలకు అధికారులు మరింత చేరువ అవుతారని అభిప్రాయపడ్డారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బొమ్మనహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ అరెస్టు చేశారు. అతడి నుంచి 12 ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. ఈ వివరాలను గురువారం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన వీ సురేష్ బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు, నేమకల్లు, ఉద్దేహాళ్, కణేకల్లుక్రాస్, రాయదుర్గం పట్టణం, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణంలో దుకాణాల ముందు, దేవాలయ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసే వాడన్నారు. నేమకల్లు క్రాస్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సురేష్ పట్టుబడినట్లు తెలిపారు. రూ.ఏడు లక్షలు విలువ చేసే 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌పై బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, కణేకల్లు, రాయదుర్గం, బళ్లారి పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కో కేసు నమోదైనట్లు తెలిపారు.

## న్యాయమూర్తి పేరిట
# లంచం డిమాండ్

బెంగళూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తి పేరిట లంచం డిమాండ్ చేసిన ఓ మహిళా న్యాయవాదిపై బుధవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బెయిల్ ఇప్పించేందుకు హైకోర్టు న్యాయమూర్తికి లంచం ఇవ్వాలంటూ కక్షిదారుడినుంచి భారీగా వసూలు చేసిన మహిళా న్యాయవాదిపై హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్ తీవ్రంగా పరిగణించారు. న్యాయవాది దయినాబానుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించిన మేరకు విధాన సౌధ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఓ వివాదంలో అరెస్టు అయిన 24ఏళ్ళ విష్ణుదేవ్‌కు మూడేళ్లుగా బెయిల్ లభించడం లేదు. కుమారుడిని విడిపించేందుకు విష్ణుదేవ్ తల్లి థెరెసా, న్యాయవాది మరీనా ఫెర్నాండెజ్‌ను కలిశారు. బెయిల్‌కోసం మరీనా రూ.10లక్షలు వసూలు చేశారు. అయితే బెయిల్ ఇప్పించలేకపోయారు. దీంతో థెరెసా తన డబ్బులు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో న్యాయవాది రూ.9లక్షలకు మూడు చెక్కులు ఇచ్చారు. కానీ నగదు తీసుకోలేకపోయారు. ఈలోగా న్యాయవాది మరీనా, ఆరతి అనే మహిళను పరిచయం చేయించారు. ఆమె హైకోర్టు న్యాయమూర్తి ఒకరు పరిచయం ఉన్నారని రూ.72వేలు నగదు తీసుకున్నారు. కేసు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఇటీవలే మరో మహిళా న్యాయవాది దయినాబా, థెరెసాకు పరిచయమయ్యారు. బెయిల్ కోసం ఓ న్యాయమూర్తి రూ.50 లక్షలు తీసుకోదలిచారని, సమకూర్చితే సాధ్యం చేస్తామని లేదంటే మరో న్యాయవాదిని చూసుకోవాలని తేల్చిచెప్పారు. ఇదే విషయాన్ని బాధిత మహిళ థెరెసా హైకోర్టు రిజిస్ట్రార్ రాజేశ్వరికి ఫిర్యాదు చేయడంతో ఆమె సూచనల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## ఎమ్మెల్యే మునిరత్నపై దాడితో...
# ఎమ్మెల్సీ సీటీ రవికి భద్రత పెంపు

▸▸ కాంగ్రెస్ గూండాయిజంకు రుజువు - ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై కోడిగుడ్లతో దాడి చేసిన సంఘటన నేపథ్యంలో ఎమ్మెల్సీ సీటీ రవికి భద్రత పెంచారు. వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరుగా మారుతున్నాయి. దీంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. విధానపరిషత్‌లోనే ఎమ్మెల్సీ సీటీ రవిపై దాడి సంఘటన మరువకముందే ఎమ్మెల్యే మునిరత్నపై దాడి సంఘటనతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. సీటీ రవికి భద్రత పెంచారు. ఆయన వెంట ఒక ఎస్కార్ట్ వాహనం సమకూర్చారు. కాగా బీజేపీ ప్రజాప్రతినిధులు సీటీ రవి, మునిరత్నలపై దాడికి రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాయిజంకు నిదర్శనమని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గూండా పాలన సాగుతోందన్నారు. దాడులను తాము తీవ్రంగా పరిగణిస్తామన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

చింతామణి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డు మార్గంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. నగరసభ కమిషనర్ నేతృత్వంలో గురువారం కార్యాచరణ జరిగింది. తొలగించిన స్థలంలో ఉన్న చెత్తాచెదారం, మట్టి, సిమెంటు వ్యర్థాలను అన్నింటినీ ట్రాక్టర్ల ద్వారా తరలించారు. అన్ని ప్రధాన రహదారుల ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండు రోజులుగా సాగుతోంది. ఇప్పటికే నగరసభ కమిషనర్ సూచనలు చేయడంతో దుకాణదారులు స్వచ్ఛందంగా తొలగించారు. అయితే కొన్ని చోట్ల మాత్రం నగరసభ ఆధ్వర్యంలోని రెండు పొక్లైనర్‌ల సాయంతో కార్యాచరణ జరిగింది. నగరసభ కమిషనర్ చలపతి మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బందిలేని రీతిలో కార్యాచరణ జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రక్రియ కొనసాగుతుందన్నారు.



ఆక్రమణల ప్రదేశంలో మట్టి, చెత్తా చెదారం తొలగింపు

### టమోటా కిలో రూ.12

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

### చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు ట న్ను గరిష్ఠంగా రూ. 25,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్య దర్శి గోవిం దు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలుతో అమ్ముడు పో యినట్లు తెలిపారు.

### ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 774 క్యూసెక్కులు ఉన్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 172 క్యూసెక్కులు వెళుతోందని వివరించారు. ప్రస్తుతం 1.681 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు.

### విద్యార్థిని అదృశ్యం..

గోరంట్ల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహన్‌రావు కాలనీకి చెందిన 22యేళ్ల విద్యార్థిని అదృశ్యమైనట్లు గురువారం సీఐ శేఖర్ తెలిపారు. అనంతపురంలో బిఎస్సీ నర్సింగ్ మూడవ సంవత్సరం చదువుతోందని, సెలవుల నిమిత్తం స్వగ్రామం గోరంట్లకు వచ్చిందన్నారు. ఈనెల 22వ తేదీ రాత్రి నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

# ఇల్లే లేదు.. అప్పు ఎట్లా కట్టేది ?

ప్రశ్నిస్తున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

రుణం చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి

ఎక్కడికక్కడ నోటీసులు జారీ చేస్తున్న వైనం

అయోమయంలో బాధిత వర్గాలు



టిడ్కో ఇళ్లు

అనంతపురం సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంకా ఇల్లే అప్పగించలేదు. కానీ రుణం మాత్రం చెల్లించాలంటూ బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత టీడీపీ పాలనలో ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. లబ్ధిదారుల సంఖ్యను సైతం తగ్గించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16272మందికి ఇళ్లు కట్టించి ఇస్తామని మమ అనిపించింది. ఏళ్లు గడిచినా లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరలేదు. అంతలోనే బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా...

- టీడీపీ పాలనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సంఖ్య: 50,914
- వైసీపీ రద్దు చేసిన లబ్ధిదారుల సంఖ్య: 34,642
- రద్దు చేసిన లబ్ధిదారులకు చెల్లించాల్సిన నగదు: రూ. 33 కోట్లు
- వైసీపీ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిన వారి సంఖ్య : 16,272
- ఐదేళ్లలో కట్టించి అప్పగించిన లబ్ధిదారుల సంఖ్య: 370 మాత్రమే
- ఇంకా కట్టించాల్సిన టిడ్కో ఇళ్ల సంఖ్య : 15,902
- బ్యాంకర్లు నోటీసులు పంపించిన సంఖ్య : 50శాతం
- కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు: సుమారు రూ. 40 కోట్లు

### ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంతే...


ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ పాలనలో 50,914ఇళ్లను మంజూరు చేయగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ వాటిని నిర్మించలేమని చేతులెత్తేసింది. 16,272 ఇళ్లను కట్టించి మిగిలిన 34,642మందికి సంబంధించిన (వారు చెల్లించిన నగదు) రూ. 33 కోట్లు వెనక్కి ఇస్తామని ప్రకటించింది. ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. లబ్ధిదారులకు డబ్బు చెల్లించలేదు, ఇళ్లూ కట్టించలేదు. గత ఐదేళ్లలో కేవలం 370 ఇళ్లను మాత్రమే అదీ కూడా 2024 ఎన్నికల ముందు హడావుడిగా పూర్తి చేసి సదరు లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన 15,092 ఇళ్ల పరిస్థితి మాత్రం నేటికి అగమ్యగోచరంగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం ఆగిపోయినట్లు అధికార వర్గాల సమాచారం. ప్రభుత్వాలు మారేయేగానీ.. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు మాత్రం తీరలేదు. ఇంతలోనే రుణం చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు జారీ చేయడంతో బాధిత వర్గాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

### టిడ్కో ఇళ్ల పథకం అమలు తీరు ఇదీ...

టిడ్కో ఇళ్లను మూడు కేటగీరీలుగా విభజించారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.1 కి (300 చదరపు అడుగులు) కలిగిన సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు(దీనికి ఎలాంటి రుణం ఉండదు) 365 చదరపు అడుగులు కలిగిన సింగిల్ బెడ్ ఇల్లు కావాలనుకునే లబ్ధిదారుడు రూ. 25,000 చెల్లించాలి. బ్యాంకు రూ.3.15లక్షలు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వీటితో పాటు 430 అడుగులతో డబుల్ బెడ్ రూం కలిగిన ఇల్లు పరంగా.. లబ్ధిదారుడి వాటా రూ. 50,000 చెల్లిస్తే, బ్యాంకు రూ. 3.65లక్షలు రుణం ఇస్తుంది. మిగిలిన అమౌంట్ రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా టిడ్కో ఇళ్లకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఎంతో ఆశగా మధ్య తరగతి ప్రజలు నగదును చెల్లించి లబ్ధిదారులుగా చేరిపోయారు. అయితే వైసీపీ సర్కార్ టిడ్కో ఇళ్లను ఏమాత్రం పట్టించుకోలేదు.

### మూడు నెలల నుంచి నోటీసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు గత మూడు నెలల నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. ఆయా లబ్ధిదారులకు సంబంధించిన సబ్సిడీ సొమ్ము తీసివేసి మిగిలిన రుణాన్ని చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో బ్యాంకర్లతో లబ్ధిదారులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకులు సైతం ఆ లబ్ధిదారుల అకౌంట్‌లను ఎన్‌పీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆ అకౌంట్ నుంచి లావాదేవీలు జరగకపోవడంతో బాధిత లబ్ధిదారులకు బ్యాంకింగ్ సేవల పరంగా అంతరాయం ఏర్పడుతోంది. టిడ్కో ఇల్లు తెచ్చిన తంట తమ బ్యాంకు సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ప్రధానంగా సిబిల్ స్కోర్‌పై ప్రభావం చూపడంతో భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50శాతం మందికి నోటీసులు జారీ చేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇప్పటికే నిర్మాణాలు ఆపేశారు.




అప్పట్లో ఇచ్చిన ధ్రువ పత్రాలతో వనజ

**ప్రభుత్వానికి నివేదించాం**

నోటీసుల విషయమై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదించాం. బ్యాంకర్లకు కూడా తగిన గడువు ఇవ్వాలని సూచించాం. ప్రస్తుతానికి నోటీసులు పంపకుండా ఉండాలని చెప్పాం. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారు పనులు చేయడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం.

- సుధారాణి, టిడ్కో ఈఈ



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1627.64 | 1,589.42 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 331 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 7,389 | 103 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 85.46 | 10.56 |

## ఘనంగా అయ్యప్ప మండలపూజ



కొలువుదీరిన అయ్యప్పస్వామి

బళ్లారి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ప్రధాన అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవలు, గణపతి హోమం, సుదర్శన హోమం, నవ గ్రహ హోమం, అయ్యప్ప స్వామి హోమం నిర్వహించారు. సాక్షాత్తు శబరిమలలో వెలసిన అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయ్యప్పమాలధారులు భజనలు, పూజలతో పరవశించి పోయారు. అయ్యప్ప పూజలకు నగరంలోని భక్తులతో పాటు సమీప గ్రామాల మాలధారులు హాజరయ్యారు. అయ్యప్ప దేవాలయ కమిటీ అధ్యక్షుడు జయప్రకాష్, గుప్తా, కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బుడా మాజీ అధ్యక్షుడు పి. పాలన్న, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## కలలను సాకారం చేసుకోవాలి

● విద్యార్థులకు వక్తల సూచన

బళ్లారి సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి కలలు సాకారం అయ్యేలా చూసుకోవాలని, సమాజం మెరుగుపరచడానికి ఇది సహాయపడుతుందని మునిరాబాద్ సంస్థ ఆఫ్ ఇంజనీర్ల సంస్థ యొక్క అధ్యక్షుడు ఎస్ఎం శశిధర్ అన్నారు. గురువారం హొసపేటలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో, పీఎంశ్రీ పథకం కింద ఏర్పాటు చేసిన విజ్ఞాన, తంత్రజ్ఞాన, ఇంజినీరింగ్, గణిత (ఎస్.టీ.ఇ.ఎమ్) గురించి విశేష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సమస్యలకు ప్రయోగాత్మకంగా పరిహారం కనిపెట్టడంలో ఎస్‌టీఈఎమ్ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. తదుపరి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మనోహర్‌లాల్ జింగర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జాగతిక విద్యమానాల గురించి తెలిపారు.

### యువకులపై స్థానికుల దాడి

రాయచూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు పట్టణంలో గురువారం నలుగురు యువకులపై స్థానికులు దాడి చేశారు. మూత్ర విసర్జన విషయంలో యువకులు, స్థానికుల మధ్య వాగ్వాదం తలెత్తింది. యువకులపై స్థానికులు రాళ్లు, కట్టెలతో దాడులు చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం దాదాపీర్, ఫెరోజ్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు లింగసుగూరు పోలీసులు తెలిపారు.

# వాయుగండం..!

● బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావం
● జిల్లావ్యాప్తంగా చిరు జల్లులు, చల్లటి గాలులు
● మిరప, వరి రైతుల్లో ఆందోళన



సిరుగుప్ప వద్ద చిరుజల్లులకు తడిసిపోతున్న ఎండుమిరప

బళ్లారి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాల్లో చిరుజల్లులు, గాలులు రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వాయుగుండం తీవ్ర ప్రభావం చూపుతోంది. తేలిక పాటి జల్లులు, చల్లటి గాలి కారణంగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. తీవ్ర చలిగాలులతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో చలికి జనం గజగజ వణికిపోతున్నారు. బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలతో పాటు అందరి పైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. తేలిక పాటి జల్లులు రోజంతా కురుస్తున్నాయి. పొలాల్లో రాశులుగా వేసుకున్న వరి, మిరప తదితర పంటల తడిసిపోతున్నాయి. తుంగభద్ర ఆయకట్టు కింద కోతలో ఉన్న వరి పంట తడిసిపోయింది. మిషన్ల ద్వారా కోసిన వరి జల్లుకు తడిసిపోతున్నాయి. మిరప, జొన్న, మొక్కజొన్న పంటలు కూడా తడిసి పోతున్నాయి. పొలాల్లో ఉండే ధాన్యపు రాశుల సంగతి అలా ఉంటే పంటను అమ్ముకునేందుకు ఏపీఎంసీకి తరలించిన పంటలు కూడా రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. చేతికి అందిన పంటకు ధర లేక ఇప్పటికే రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తుఫాన్ ప్రభావం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

తుంగభద్ర అయకట్టు కింద సుమారు 12 లక్షల ఎకరాల్లో వరి కోత సాగుతుంది. కొన్ని ప్రాంతాల్లో వరి కోత కోస్తుంటే.. కంప్లి, సండూరు, సిరుగుప్ప, విజయనగరం, బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలో పరిధిలో వరి కోత కోసి రాశులు పోశారు. వరి ధర ప్రస్తుతం క్వింటాల్ ధర రూ. 2వేల నుంచి రూ.2,200 వరకు ఉంది. ఇతర పంటలు కూడా ధర తగ్గిపోయాయి. ఇక వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటల రేట్లు కూడా బాగా తగ్గిపోయాయి. వాతావరణంలో మార్పు కారణంగా తడిసిపోతే మరింత ధరలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట నోటికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో కూడా వాతావరణం ప్రభావం కారణంగా జన జీవనం స్తంభించింది. చలిగాలలకు జనం బయటకు రావడం లేదు.

# విద్యతోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

● జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ విద్యావంతులు అయితేనే బాలకార్మికుల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థలో గురువారం జరిగిన కార్మికశాఖ, వ్యాపారులు, పారిశ్రామికవేత్తల స్నేహపూర్వక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ సమాజానికి పెను శాపమన్నారు. అధికారులు, వ్యాపారులు పరస్పరం మానవత్వంతో సమస్యకు పరిష్కారాలు కనుగొనాలన్నారు. ప్రతి మూడు నెలలు లేదా ఆరు నెలలకొకసారి శాఖాపరమైన సమాచారం కొత్త ఆలోచనలను వ్యాపారులకు తెలియజేయాలన్నారు. కార్మిక శాఖ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించడమే ఇందుకు కారణమన్నారు.

లీగల్ సర్వీసెస్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో కోటిమంది బాలకార్మికులు, ప్రపంచవ్యాప్తంగా 21కోట్ల మంది బాలకార్మికులు ఉన్నారని, బాలకార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కట్టుబడాలన్నారు. లేబర్ ఆఫీసర్ సిద్దప్ప ఖైనూరు మాట్లాడుతూ కార్మికశాఖ 24చట్టాలను అమలు చేస్తోందని, ఒక్కో చట్టం కింద వ్యాపారులు పారిశ్రామికవేత్తలను గుర్తిస్తున్నామన్నారు. బాలకార్మిక నిర్మూలనకు వ్యాపారులు సహకరించాలన్నారు. బాలకార్మిక నియంత్రణ అధికారి మౌనేశ్ మాట్లాడుతూ బాలల హక్కులను అమలు చేయడంలో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమల శాఖ సంయుక్తకార్యదర్శులు మర్చేడ్ మల్లికార్జునగౌడ్, రామచంద్ర, పోలా విక్రమ్, రాజేశ్, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ తదితరలు, సురేశ్‌బాబు వివిధ సంస్థల అధికారులు,సభ్యులు పాల్గొన్నారు.

# మైలారలో మౌలిక సౌకర్యాల కొరత

● వాహనాల పార్కింగ్‌కు భక్తుల తిప్పలు ● ఉత్సవాల సమయంలోనే అధికారుల హడావుడి



రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలు

బళ్లారి సిటీ,డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హూవినహడగలి తాలూకా ధార్మిక పుణ్యక్షేత్రం మైలారలో మౌలికసౌకర్యాలు కరువయ్యాయి. మైలార్ లింగేశ్వరుని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలో మైలారలింగేశ్వరుని కార్తిక మహోత్సవం జరగనుంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా వస్తుంటారు. ప్రతి పూర్ణిమ, ఆదివారం, గురువారాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుంటారు. జిల్లా యంత్రాంగం జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టి చేతులు దులుపుకుంటోంది. సమగ్రాభివృద్ధి శాశ్వత ప్రణాళిక లేకపోవడంతో పౌర్ణమి, ప్రత్యేక రోజుల్లో దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది తప్పడం లేదు. భక్తులు అడుగుపెట్టగానే పార్కింగ్ కష్టాలు మొదలవుతాయి. పార్కింగ్‌కు స్థలం లేకుండా రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలపాల్సివస్తోంది. పార్క్ చేసిన వాహనాలను తీసుకోవాలంటే యుద్ధం చేయాల్సిందేనని భక్తులు వాపోతున్నారు. పలు మార్లు స్థానికులతో భక్తులు గొడవ పడుతుంటారు. శాశ్వత అభివృద్ధికి ప్రణాళిక, ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రత్యేక పూజా మండపం, అభిషేక సేవ కోసం విశాలమైన దాసోహ భవనం నిర్మించాలని, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భక్తులకు వసతులతో కూడిన గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

లింగేశ్వరుడి దేవాలయం





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సత్యబాబు

## 29 నుంచి సీపీఎం రాష్ట్ర సదస్సు

బళ్లారి సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర సదస్సు ఈనె 29 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు సత్యబాబు ప్రకటించారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సులో ప్రజాస్వామ్యాన్ని కాపాడడం, సామరస్యాన్ని బలోపేతం చేయడం, ప్రజల జీవితాలపై దాడులను తిప్పికొట్టండి అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సును కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబి ప్రారంభిస్తారన్నారు. సీపీఎం జాతీయ నాయకులు బీవీ రాఘవులు, విజయ రాఘవన్ తదితరులు పాల్గొంటారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. ఒక దేశం ఒకే ఎన్నిక నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. మన దేశం యూనియన్ వ్యవస్థలో భిన్నమైన సంస్కృతి ఉంది, అనేక భాషలు ఉన్నాయి. మేము యూనియన్ వ్యవస్థలో ఐక్యంగా ఉన్నాము విధానసభ, జిల్లా, తాలూకా, గ్రామ పంచాయతీలుగా అధికార వికేంద్రికరణ నెలకొందన్నారు. ఒకే ఎన్నిక ఒకే దేశం అందరినీ ఏకం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఇది ప్రజల మన రాజ్యాంగ ఆకాంక్షలను దెబ్బతీస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రాలకు రావాలసిన గ్రాంట్లు విడుదల చేయడం లేదన్నారు. గవర్నర్ల అధికారాలను దుర్వినియోగం చేయడం,దర్యాప్తు సంస్థల హక్కులను అణచివేయడం ద్వారా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలను తీసుకురావడానికి బీజేపీ వ్యతిరేక పార్టీలు వివక్షాపూరిత విధానాన్ని అనుసరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు రాజకీయంగా పార్టీని బలోపేతం చేసేందుకు భూ కార్మికుల సమస్యలు, వర్గ సమస్యలు, సామాజిక సమస్యలపై సదస్సులో చర్చిస్తారన్నారు. తదుపరి అఖిల భారత సదస్సును ఏప్రిల్ 2నుంచి 5వరకు తమిళనాడులోని కాంచీపురంలో ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ సభ్యులు చంద్రకుమారి, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసన పుస్తకంతో విద్యార్థుల్లో భయానికి చెక్

● రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి



ఉపాధ్యాయులు, విద్యార్థులతో రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తరగతిలో వెనకబడిన పిల్లలను గుర్తించి పిల్లల అభ్యసనను మెరుగుపరచి పరీక్షల భయాన్ని తొలగించడానికి అభ్యసన పుస్తకం ఉపయోగపడుతోందని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎనిమిదో తరగతి పిల్లలకు అభ్యసన పుస్తకాలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఈ పుస్తకాలు కర్ణాటక జిల్లాలో బళ్లారి, విజయనగరం, కొప్పళ, రాయచూరు, యాదగిరి, కలబుర్గి, బీదర్ జిల్లాల సంక్షేమానికి ఉపకరిస్తున్నాయన్నారు. పిల్లలు పరీక్షా సమయంలో సమయాన్ని వృథాచేయకుండా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి,ఉమ్మెహాని, రామాంజనేయ, గురుప్రసాద్, విజయముండ్రగి పాల్గొన్నారు.

## గ్రామంలో అసౌకర్యాలపై నిరసన



ఈఓ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ పదాధికారులు

సిరుగుప్ప, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామంలో అసౌకర్యాలపై గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. రారావి గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మౌలిక సదుపాయాలు అందడం లేదని డీవైఎఫ్ఐ తాలుకా అధ్యక్షుడు వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్‌కు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఏ వీధికెళ్లినా డ్రైనేజీలు, రోడ్లు సరిగా లేవని ఆరోపించారు. 2019లో రోడ్డు, డ్రైనేజీలకు నిధులు విడుదలైనా ఇంతవరకు పనులు జరుగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి తోరణగల్లు స్వామి, తాలుకా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, అశోక, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నడిరోడ్డుపైనే మురుగునీరు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కంప్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్రి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నాపురం గ్రామం అసౌకర్యాలకు నిలయం గా మారింది. డ్రైనేజీలు లేకపోవడంతో ఏ వీధిలో చూసినా మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇళ్లలోనుంచి యథేచ్ఛగా మురుగునీటిని రోడ్లపైకి వదులుతున్నారు. సరైన మురుగు కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

## ఆటో బోల్తా.. బాలుడి మృతి

డీ.హీరేహాళ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఒక ఆటో బోల్తాపడడంతో జగదీష్(12) అనే బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి గురువారం ఉదయం దేవుని దర్శనం కోసం కొండ్లపల్లి గ్రామం నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో బయలుదే రి వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బళ్లారి-రాయదుర్గం రోడ్డు నందు కల్యం గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో జగదీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి చిన్నపాటి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడ్డ జగదీష్‌ను చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జగదీష్ ఆసుపత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని అక్కడి నుండి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

# హోసూరు జోన్



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

## ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు

హోసూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్, ముగలపల్లిలోని ప్రైవేట్ క్లినిక్ సంయుక్తంగా గ్రామంలో ఉచిత ప్రజా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి బాలకృష్ణారెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కంటి, చెవి, ముక్కు, గొంతు సమస్యతోపాటు రక్తపోటు, మధుమేహం, పాదాలు, కీళ్లనొప్పులు, ఇలా అన్ని రకాల వ్యాధులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందచేశారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొనగా శిబిరం ద్వారా 500 మందికిపైగా గ్రామస్తులు ప్రయోజనం పొందారు.

## ముగిసిన లేబర్ ఫ్రంట్ సమావేశాలు

హోసూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని ప్రైవేట్ కల్యాణ మంటపంలో న్యూడెమొక్రటిక్ లేబర్ ఫ్రంట్ సమావేశానికి సంఘం అధ్యక్షుడు రవిచంద్రన్ అధ్యక్షత వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సంఘం ప్రగతిపై చర్చించారు. సంఘం కోశాధికారి ప్రకాశం ఆర్థిక సమస్యలను వివరించారు. కార్యదర్శి శంకర్ సంఘం పనితీరు గురించి అభిప్రాయపడ్డారు. 2024-25 సంవత్సరానికి నిర్వాహకులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవిచంద్ర, ఉపాధ్యక్షుడిగా చిన్నస్వామి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, జాయింట్ సెక్రటరీగా రవిచంద్ర, కోశాధికారిగా ప్రకాశం, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఏళుమలై కణ్ణన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

## బాగలూరు రోడ్డును బాగు చేయండి

హోసూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన మార్గాలలో ఒకటైన బాగలూరు రోడ్డును బాగు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడి, కంకరతేలింది. ఇటీవల కొన్నిరోజులుగా అడపాదడపా వర్షం కురిసి నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోసూరు ఆల్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ నీలకంఠన్ మట్లాడుతూ జాతీయ, లేదా రాష్ట్ర రహదారుల శాఖ అధికారులు స్పందించి దుస్థితికి చేరి ప్రమాదకరంగా మారిన రోడ్డును వెంటనే బాగు చేయాలని కోరారు.



గుంతలమయమైన రహదారి

## అయ్యప్ప ఆలయంలో విశేష పూజలు



కాంతార వేషధారణలో భక్తుడు

హోసూరు డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కామరాజర్ కాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో 18వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ ధర్మశాస్త్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో తరనల్లూరు పద్మనాభ నంబూద్రీయార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో మహిళలు పాల్గొని దీపారాధనలు చేసి పూజలు నిర్వహించారు. రోజూ అయ్యప్పస్వామి పూజల్లో అందరికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మూడో వార్షిక కేరళ దుర్గాదేవి పూజలు గురువారం జరిగాయి. ఈ పూజల్లో పిల్లలు లేని వారు వెండి లేదా చెక్క ఉయ్యాల సమర్పించి అమ్మవారికి సంతానం కోసం ప్రార్థించారు. పెళ్ళికానివారు, పిల్లలు లేని వారు, విద్యార్థులు ఇలా పలు రకాల భక్తులు పాల్గొని తమ కోరికలు నెరవేర్చాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తులు ర్యాలీగా తరలివెళ్లారు.

## ఉత్సాహంగా కార్ రేస్

హోసూరు(సిప్‌కాట్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ డ్రాగ్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ 11వ కార్ రేస్ హోసూరు సమీపంలోని బేలగొండపల్లి గ్రామం తనేజా ఏరోస్పేస్ ఏవియేషన్ లిమిటెడ్ (టీఏఎల్)లో గురువారం జరిగింది. హోసూరు ఏఎస్పీ అక్షయ్ అనిల్ వాకర్, షైజా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ముహమ్మద్ అలుముద్దీన్ షైజా అక్బర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని కార్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోసూరు మత్తిగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముత్తమిళ సెల్వరసు ఆధ్వర్యంలో బందోబస్తు నడుమ భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనారు. పోటీల్లో పలువురు ఉత్తమ ప్రతిభ చాటారు.



కార్ రేస్‌కు జెండా ఊపుతున్న ఏఎస్పీ అనిల్ వాకర్